RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్ DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 20 గురువారం 2026 | సంపుటి : 16 | సంచిక : 197 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | THURSDAY AUGUST 20 2026 | VOL:16 | ISSUE: 197 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# పెట్టుబడులే లక్ష్యం.. సీఎం రేవంత్ 10 రోజుల విదేశీ పర్యటన

**యూకే, అమెరికాలో పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం**

**ప్రఖ్యాత వర్సిటీలు, గ్లోబల్ సీఈవోలతో సమావేశాలు**

**లండన్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ కుమార్తె వివాహానికి హాజరు**

**ఢిల్లీ సీడబ్ల్యూసీ భేటీ అనంతరం పయనం**



తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం, విద్యా రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు కుదుర్చుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. రేపటి నుంచి (ఆగస్టు 20) ఆయన యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికాలో 10 రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 30న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈరోజు (ఆగస్టు 19) ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొననున్న సీఎం, సమావేశం ముగిశాక రాత్రికి ఢిల్లీ నుంచే నేరుగా లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20న లండన్‌లో ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ కుమార్తె వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరవుతారు. పర్యటనలో భాగంగా తొలుత యూకేలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ యూనివర్సిటీల ప్రతినిధులతో సమావేశమవుతారు. బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సందర్శించడంతో పాటు, ఎమిరేట్స్ స్టేడియంలో ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్‌కు హాజరవుతారు. అనంతరం ఆగస్టు 23న అమెరికాకు బయలుదేరి వెళ్తారు. అక్కడ బోస్టన్‌లోని హార్వర్డ్,

(మిగతా 2వ పేజీలో..)

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

**టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో**

**పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు**

**టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం**

**నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం**

**'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు**

భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

(మిగతా 2వ పేజీలో..)

## కోకాపేటలోని నివాసంలో హరీశ్ రావు హౌస్ అరెస్ట్

**సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రి సందర్శనకు పిలుపునిచ్చిన హరీశ్ రావు**

**ముందస్తు జాగ్రత్త చర్యగా హరీశ్ రావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు**

మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావును పోలీసులు కోకాపేట్‌లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు.

(మిగతా 2వ పేజీలో..)



## యూ-టర్న్ తీసుకున్న తమిళనాడు ప్రభుత్వం.. విద్యార్థుల నిరసనలపై నిషేధాజ్ఞల ఉపసంహరణ

**విద్యార్థులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలంటూ సర్క్యులర్ జారీ చేసిన తమిళనాడు ప్రభుత్వం**

**విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత**

**ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన విజయ్ సర్కార్**



తమిళనాడు ప్రభుత్వం విద్యార్థుల ఆందోళనలు, నిరసనలపై జారీ చేసిన వివాదాస్పద ఆదేశాలను వెనక్కి తీసుకుంది. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, యువత వివిధ నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలంటూ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేస్తున్నట్లు విజయ్ సర్కార్ ప్రకటించింది. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లో ముఖ్యంగా లెఫ్ట్ పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ చేపడుతున్న ఆందోళనల్లో విద్యార్థులు పాల్గొనకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడంపై విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. రాజ్యాంగం కల్పించిన నిరసన

(మిగతా 2వ పేజీలో..)

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

**దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందన్న ఖర్గే**

**ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆరోపణ**

**కేంద్రం నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపై నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శ**

ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా

(మిగతా 2వ పేజీలో..)



# గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు: అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

**గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం**

**సీఐడీ కస్టడీలో ఉన్న హాయ్‌లాండ్‌లో వాల్యుయేషన్ జరిపి అక్రమాలకు పాల్పడ్డారన్న సీఎం**

**భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ**

గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి



(మిగతా 2వ పేజీలో..)

## సీటు రగడ.. సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

**పరకాల టికెట్‌పై రేవంత్‌ను ప్రశ్నించిన కొండా సుష్మిత**

**రేవూరికి టికెట్ ఎలా ఖరారు చేస్తారని నిలదీత**

**టికెట్లను అధిష్ఠానమే నిర్ణయిస్తుందని స్పష్టీకరణ**

**బీసీల పట్ల వివక్ష చూపుతున్నారని రేవంత్‌పై ఆరోపణలు**



తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## పెట్టుబడులే లక్ష్యం.. సీఎం రేవంత్ 10 రోజుల విదేశీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ఎంఐటీ క్యాంపస్‌లను సందర్శిస్తారు. నార్త్‌ఈస్టర్న్, వర్జీనియా టెక్ యూనివర్సిటీల ప్రతినిధులతోనూ భేటీ అవుతారు. న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు.ఈ పర్యటనలో అత్యంత కీలకమైన భాగంగా ఆగస్టు 27, 28 తేదీల్లో గ్లోబల్ సీఈవోలు, వెంచర్ క్యాపిటలిస్టులు, బహుళజాతి సంస్థల అధిపతులతో పారిశ్రామిక రౌండ్‌టేబుల్ సమావేశాలు జరగనున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై సీఎం దృష్టి సారిస్తారు. వాస్తవానికి ఈ పర్యటనలో చైనా, జర్మనీలను కూడా చేర్చాలని భావించినప్పటికీ, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో దానిని యూకే, అమెరికాకే పరిమితం చేశారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

## కోకాపేటలోని నివాసంలో హరీశ్ రావు హౌస్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిమ్స్ (TIMS) ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు.ఈ పర్యటన పిలుపు నేపథ్యంతో తెల్లవారుజాము నుంచే కోకాపేట్‌లోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. హరీశ్ రావు ఇల్లు విడిచి బయటకు రాకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో వాతావరణం వేడెక్కింది. ఈ ఆకస్మిక పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా... హరీశ్ రావు హౌస్ అరెస్ట్ వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సీటు రగడ.. సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ టికెట్ వ్యవహారం మరోసారి వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పిలుపునిచ్చారు. దీనిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇస్తామని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని సుష్మిత నిలదీశారు. పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో టికెట్లను పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, నేతలు కాదని అన్నారు.తన తండ్రి కొండా మురళిని రేవంత్‌రెడ్డి ఎందుకు పక్కన పెడుతున్నారని సుష్మిత ప్రశ్నించారు. కొండా మురళి సాధారణ నేత కాదని, కింగ్ మేకర్ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో తొలుత కోరింది కొండా దంపతులేనని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్ అయిన తర్వాత రేవంత్‌రెడ్డి తమ ఇంటికి వచ్చారా? అని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సుష్మిత పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సంగారెడ్డి టికెట్‌ను అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పిన సీఎం.. పరకాల విషయంలో మాత్రం తానే ఎలా నిర్ణయం చెబుతారని నిలదీశారు.యువతకు టికెట్లు ఇవ్వాలని చెబుతూ రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తామని చెప్పడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం పదవిని కాపాడుకోవాలంటే నిబద్ధత అవసరమని వ్యాఖ్యానించారు. బీసీల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఆరోపించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా సుష్మిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మరో 'పొంగు' ఉందని, ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి ఎవరో తెలియని పరిస్థితి ఉందంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

(మొదటి పేజీ తరువాయి)

మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ 'విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్'ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

## యూ-టర్న్ తీసుకున్న తమిళనాడు ప్రభుత్వం.. విద్యార్థుల నిరసనలపై నిషేధాజ్ఞల ఉపసంహరణ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపే ప్రాథమిక హక్కును కాలరాసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో, ఈ వివాదం తీవ్ర రూపం దాల్చక ముందే స్పందించిన ప్రభుత్వం.. తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటూ యు-టర్న్ తీసుకుంది.

## గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు: అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి, తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు, బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ-మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు.సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు. వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త ఛైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు. జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా, మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు.గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. "తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?" అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

(మొదటి పేజీ తరువాయి)

(టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మల్లు రవి స్పందన

**పరకాల టికెట్ మళ్లీ రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఇస్తామన్న రేవంత్**

**ఎన్నికలకు చాలా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారన్న సుస్మిత**

**పార్టీలో క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవన్న మల్లు రవి**



తెలంగాణ మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే రాబోయే ఎన్నికల్లో మళ్లీ టికెట్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది.పరకాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారంటూ సీఎం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే సీఎం రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ముల భాగోతాలు, స్కాములను బయటపెడతానని హెచ్చరించడం ప్రకంపనలు సృష్టించింది.ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవి తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న సుస్మిత వ్యాఖ్యలపై పూర్తి సమాచారం తెప్పించుకున్న తర్వాత క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీలో లక్ష్మణరేఖను దాటి ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ఈ అంతర్గత వివాదంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్పందిస్తూ, పూర్తి నివేదిక ఇవ్వాలని పీసీసీ నాయకత్వాన్ని ఆదేశించారు. మరోవైపు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పందిస్తూ, పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అందరికీ శిరోధార్యమని, అనవసర వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వబోనని తెలిపారు.

## కోల్‌కతాలో ఘోర అగ్నిప్రమాదం.. 9 మంది బంగ్లాదేశీయులు సజీవ దహనం

**మృతులంతా వైద్య చికిత్స కోసం వచ్చినవారే**

**ఆరుగురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు**

**ఘటనపై అధికారుల దర్యాప్తు ప్రారంభం**

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషాద ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, మృతులందరూ బంగ్లాదేశ్ పౌరులని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో నగరంలోని మిర్జా గాలిబ్ వీధిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తీసుకువచ్చి సహాయక చర్యలు చేపట్టారు.ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. మృతులంతా వైద్య చికిత్స నిమిత్తం బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన మరో ఆరుగురిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



# అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం







**ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం: మంత్రి పొంగులేటి**

**పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు**

**నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 19 (దేశ టైమ్స్):**

అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం అందించి, సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లయితే వాటిని గుర్తించి, వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం**

ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన భూములను సమీకరించి అర్హులకు ఇళ్ల స్థలాలు అందిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

**పల్లెగూడెం అభివృద్ధికి రూ.61.76 కోట్లు**

పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి మొత్తం రూ.61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్‌ఎస్పీ కాల్వ గట్టుపై రూ.5.80 కోట్లతో చేపడుతున్న మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

**నూతన అంగన్‌వాడీ భవనానికి రూ.12 లక్షలు**


రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల్లోనే నాణ్యతతో పూర్తి చేయడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షల వ్యయంతో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**110 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. జిల్లాలో 110 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయని, వాటి పనులన్నీ గ్రౌండింగ్ చేసి వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణ పనులు కూడా తుది దశలో ఉన్నాయని చెప్పారు. వివో భవనాల నిర్మాణానికి 20 చోట్ల స్థల సమస్య ఉన్నట్లు గుర్తించామని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి పనులను బాధ్యతగా పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్‌ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్‌ఈ వెంకట్ రెడ్డి, ఈఈ మహేష్ బాబు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కమిషనర్ శ్రీనివాస రెడ్డి, పల్లెగూడెం సర్పంచ్ చుండూరి సుజన కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపురం పండ్ల మార్కెట్ యార్డుకు రూ.17.72 కోట్ల నిధులు





**మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో 31 అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 19 (దేశ టైమ్స్):**

ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.17.72 కోట్ల భారీ నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత �) జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ యార్డు నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.1,772 లక్షల పరిపాలనా అనుమతులు లభించాయి. గతంలో పండ్ల మార్కెట్ యార్డు నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోవడంతో వ్యాపారులు రోడ్లపైనే పండ్ల విక్రయాలు నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలు, వర్షాలు, ఎండలు, పారిశుద్ధ్య సమస్యల కారణంగా వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించింది.

31 అభివృద్ధి పనులకు నిధులు

మార్కెట్ యార్డులో మొత్తం 31 అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా షాపింగ్ కాంప్లెక్స్ బ్లాక్-ఏ, బ్లాక్-బిల నిర్మాణానికి చెరో రూ.1.02 కోట్లు, కమర్షియల్, ట్రేడర్స్ షాపుల బ్లాక్-ఏ, బ్లాక్-బిలకు చెరో రూ.1.53 కోట్లు కేటాయించారు. చిన్న ఆర్చ్ రూఫ్ షెడ్లను ట్రేడర్స్ షాపులుగా మార్చేందుకు రూ.99 లక్షలు, కొత్త కవర్ షెడ్ నిర్మాణానికి రూ.2.22 కోట్లు, 60 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఎలక్ట్రానిక్ వెయింగ్ బ్రిడ్జికి రూ.26 లక్షలు, రైతుల విశ్రాంతి భవనానికి రూ.64 లక్షలు, టాయిలెట్ బ్లాక్‌కు రూ.57 లక్షలు, 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.58 లక్షలు కేటాయించారు. అలాగే మార్కెట్ యార్డు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.86 లక్షలు, సీసీ ఫ్లోరింగ్, రోడ్ల అభివృద్ధికి రూ.3.11 కోట్లు, బిగ్ ఆర్చ్ రూఫ్ షెడ్లలో ట్రేడర్ల షాపుల ఏర్పాటుకు రూ.2.49 కోట్లు కేటాయించారు. టవర్ లైట్ల ఏర్పాటు, యార్డు విద్యుదీకరణతో పాటు వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లు, షెడ్లకు ప్రత్యేక విద్యుత్ సదుపాయాలు కల్పించనున్నారు.

రోడ్లపై వ్యాపారాలకు శాశ్వత పరిష్కారం

ఖానాపురం పండ్ల మార్కెట్ యార్డు అభివృద్ధి పనులు పూర్తయి వినియోగంలోకి వస్తే ప్రస్తుతం రోడ్లపై పండ్ల విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఒకే ప్రాంగణంలో షాపులు, కవర్ షెడ్లు, సీసీ ఫ్లోరింగ్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వెయింగ్ బ్రిడ్జి వంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.17.72 కోట్ల నిధులు మంజూరు చేయించడంపై ఖానాపురం ప్రాంత పండ్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించినట్లు తెలిపారు.

## పంచాయతీ కార్మికుల దీక్షకు మాజీ జడ్పీటీసీ బానోతు కొండ సంఘీభావం

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 19 (దేశ టైమ్స్):**

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బోనకల్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని మాజీ జడ్పీటీసీ బానోతు కొండ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బానోతు కొండ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని కాపాడుతూ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న వేతనాలు, ఉద్యోగ భద్రత, కార్మిక హక్కులు తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఎండా, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వారి న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని బానోతు కొండ స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించి దీక్ష చేస్తున్న పంచాయతీ కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తేలూరి రమేష్, షేక్ బాజీ, మల్లెల యాలాద్రి, పెద్ద వీరవల్లి గ్రామ ఉపసర్పంచ్ తదితరులు పాల్గొని పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపారు.

## రుద్రంగిలో నూతన బోర్ మోటార్‌కు భూమిపూజ

**రుద్రంగి ఆగస్టు19(దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని ఆచారవంతుల సంఘం దగ్గర నూతన బోర్ మోటార్ కు భూమిపూజ చేశారు. సర్పంచ్ గండి నారాయణ, మార్కెట్ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఎర్రం గంగానర్సయ్య పాల్గొని బోర్ మోటార్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచారవంతులు మాట్లాడుతూ. ఎమ్మెల్యే అయినంక వెంటన్నె మీకు ఇందిరమ్మ ఇండ్లు, కరెంట్, బోర్ మోటార్, ఇప్పిస్తా అని ఆది శ్రీనివాస్ మాట ఇచ్చిండు, ఇచ్చిన మాట ప్రకారం గెలిచి 8 మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిండు మా సంఘానికి కరెంట్ ఇప్పిచ్చిండు ఇప్పుడు బోర్ మోటార్ కూడా ఇచ్చిండు మా ఆచారవంతుల దీవెనలు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పై ఎల్లప్పుడూ ఉంటాయని ఇంకా మరెన్నో పదవులు ఆది శ్రీనివాస్ చేపట్టాలని ఆ ముక్కోటి దేవుళ్లను వేడుకుంటు పూజలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, మాజీ జడ్పిటిసి గట్ల మీనయ్య, ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ఎస్సి సెల్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, వార్డు మెంబర్లు, శీలం మీనయ్య, ఎర్రం అరవింద్, గంధం మనోజ్, సతీష్, నాయకులు, గడ్డం శ్రీనివాస్, తర్రె లింగం, తర్రె మనోహర్, కొమిరె శంకర్, పల్లి గంగాధర్, దాసరి గంగరాజం, లింగంపెల్లి నిఖిల్, శివరాత్రి రత్నం, గొర్రె నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 19 (దేశ టైమ్స్):**



బోనకల్ గ్రామానికి చెందిన ఆదిత్య పురోహితుడి ఇంట్లో జరిగిన వివాహ వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, మాజీ సహకార సంఘం అధ్యక్షులు గుండపనేని సుధాకర్‌రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకల్లో తేలూరి రమేష్, గంగుల నాగయ్య, ఒరుగు నరసింహారావు, మల్లెల యాలాద్రి, యార్లగడ్డ శ్రీను, శివ సాయి, నరసింహారావుతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామ ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**వలిగొండ ఆగస్టు19 (దేశ టైమ్స్)**



మండల కేంద్రంలో బుధవారం ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించడం జరిగింది అనంతరం ర్యాలీ నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఫోటోగ్రాఫర్ సభ్యునికి అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు బొమ్మగాని వెంకటేష్, మండల అధ్యక్షులు కొండూరు రమేష్ ఉపాధ్యక్షులు జువ్వగని సుమన్ కోశాధికారి బల్లెపు కృష్ణస్వామి ప్రధాన కార్యదర్శి ఆమనగంటి శ్రీరాములు సహాయ కార్యదర్శి మిర్యాల వెంకటేష్ ప్రచార కార్యదర్శి చిట్టబోయిన తిరుమలేష్ కార్యవర్గ సభ్యులు వేలిమినేటి రమేష్, బద్దం అయ్యప్ప, దంతూరి వెంకటేశం, ఫోటోగ్రాఫర్ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## కేకే కమిటీ ఏబీసీ కేటగిరీలను ఏకకాలంలో గుర్తించాలి

**ఉద్యమకారులకు న్యాయం చేస్తే మరో 10 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం**

**వెంటనే ప్రత్యేక వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి**

**సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు**



**వలిగొండ ఆగస్టు 19 (దేశ టైమ్స్):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఏబీసీ కేటగిరీలను ఏకకాలంలో గుర్తించాలని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా ఉద్యమకారులను గుర్తిస్తే ప్రభుత్వంపై ఉద్యమకారుల్లో విశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగితే ప్రభుత్వానికి అండగా నిలిచి మరో పది సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగేందుకు ఉద్యమకారులు కృషి చేస్తారని క్రిస్టఫర్ అన్నారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత కోసం వెంటనే ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆర్థిక సాయం అందజేత

**వలిగొండ,ఆగస్టు19(దేశ టైమ్స్):**



మండలంలోని పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన దొడ్డి ఎంకమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా ఆ కుటుంబానికి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజేఆర్ టీం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటీటీకి విజయ్ భారీ యాక్షన్ మూవీ .. ‘జననాయగన్’

**జులై 17న విడుదలైన ‘జననాయగన్’**

**యాక్షన్ డ్రామా జోనర్లో రూపొందిన సినిమా**

**300 కోట్లకి పైగా రాబట్టిన వసూళ్లు**

**ఈ నెల 21వ తేదీ నుంచి జీ 5లో స్ట్రీమింగ్**

**5 భాషల్లో అందుబాటులోకి**

విజయ్ కి తమిళనాట ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. విజయ్ అధికారంలోకి వచ్చిన తరువాత, ఆయన మొదటి సినిమాగా రూపొందిన ‘జన నాయగన్’ సినిమాపై విడుదలకి ముందే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా సంచలన విజయాన్ని సాధించడం ఖాయమనీ, రికార్డుస్థాయి వసూళ్లను రాబడుతుందనడంలో సందేహం లేదని చెప్పుకున్నారు. విడుదల తరువాత ఈ సినిమా అభిమానుల అంచనాలను అందుకోవడానికి తనవంతు ప్రయత్నం చేస్తూ వెళ్లింది. 300 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాకి, వినోత్ దర్శకత్వం వహించాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, జులై 23వ తేదీన థియేటర్లకు వచ్చింది. పూజ హెగ్డే – మమితా బైజు కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను జీ 5వారు దక్కించుకున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఈ సినిమాను తమిళంతో పాటు, తెలుగు .. మలయాళ.. కన్నడ .. హిందీ భాషల్లోను అందుబాటులోకి తీసుకురానున్నట్టుగా ప్రకటించారు. ‘వెట్రి’ కొన్ని కారణాల వలన జైలు జీవితాన్ని అనుభవిస్తాడు. క్షమా భిక్ష కారణంగా బయటికి వస్తాడు. జైలులో ఉన్నప్పుడు అక్కడి అధికారితో అతనికి పరిచయమవుతుంది. ఆ అధికారి హఠాత్తుగా చనిపోవడంతో, ఆయన కూతురు ‘విజ్జి’ ఒంటరి అవుతుంది. దాంతో వెట్రి ఆమెను చేరదీస్తాడు. అయితే ఆమెను అంతం చేయడానికి ‘హిమ్లర్’ తన గ్యాంగ్ ను రంగంలోకి దింపుతాడు. హిమ్లర్ ఎవరు? ఆయన విజ్జీని ఎందుకు చంపాలని అనుకుంటున్నాడు? ఆయన బారి నుంచి విజ్జీని కాపాడటం కోసం వెట్రి ఏం చేస్తాడు? అనేది కథ. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఏ స్థాయి రెస్పాన్స్ ను రాబడుతుందనేది చూడాలి మరి.



# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

**రుణాలను సకాలంలో చెల్లించాలి.. ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి**

**శ్రీదుర్గా మండల సమైక్య 18వ వార్షిక మహాసభలో**

**ఏపీఎం అలివేలు మంగ**



**(దేశ టైమ్స్)మరిపెడ, ఆగస్టు 19**

స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని మరిపెడ ఏపీఎం సీహెచ్. అలివేలు మంగ సూచించారు. రుణ బకాయిలు లేని సంఘాలకే కొత్త రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. మరిపెడ మండల కేంద్రంలోని శ్రీదుర్గా మండల సమైక్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన శ్రీదుర్గా మండల సమైక్య 18వ వార్షిక మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి మండల సమైక్య అధ్యక్షురాలు అజ్మీర్ వసంత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం అలివేలు మంగ మాట్లాడుతూ.. మండలంలోని అత్యధిక స్వయం సహాయక సంఘాలు సక్రమంగా పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే కొన్ని సంఘాల్లో ఒకరిద్దరు సభ్యులు రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో మొత్తం సంఘమే డిఫాల్టర్‌గా మారే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రతి సభ్యురాలు తమ రుణ బాధ్యతను గుర్తించి నిర్ణీత గడువులోపు వాయిదాలను చెల్లించాలని సూచించారు. సంఘాలు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే భవిష్యత్‌లో మరిన్ని రుణ సదుపాయాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వ ప్రోత్సాహం

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ద్వారా అనేక అవకాశాలను కల్పిస్తోందని అలివేలు మంగ తెలిపారు. తక్కువ వడ్డీ రుణాలు, బ్యాంకు లింకేజీ, వడ్డీ రాయితీలు, వివిధ ఆర్థిక ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమ, చిరు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు, చిన్నతరహా ఉత్పత్తి యూనిట్లు వంటి ఉపాధి మార్గాలను ఎంచుకుని కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు సామర్థ్యాభివృద్ధి శిక్షణలు, ఆర్థిక నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులతో సమన్వయం, రుణాల మంజూరు, జీవనోపాధి కార్యక్రమాలకు ప్రోత్సాహం, ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాల కల్పన వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మహిళా సంఘాలు బలోపేతం కావడం ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితితో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని అన్నారు. సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలిప్రతి నెలా సంఘ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించి పొదుపు, రుణాల వినియోగం, రుణాల తిరిగి చెల్లింపులు, సంఘ ఆర్థిక పరిస్థితిపై సమీక్ష చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ సమావేశంలో మండల సమైక్య కార్యదర్శి మంజుల, కోశాధికారి కృష్ణవేణి, సీసీలు కె. మల్లేశం, జి. చందులాల్, ఈ. నరసయ్య, బి. శ్రీను, బి. శ్రీరాములు, ఆఫీస్ ఆడిటర్ బి. రజిత, ఏ. విజయ్‌కుమార్‌తో పాటు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదపుటంచుల్లో పాదచారులు....

**ఆక్రమణలతో కనుమరుగవుతున్న నడకదారులు...**

**ఫుట్‌పాత్‌ల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థ అవసరం.....**

హైదరాబాద్ మహానగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. జనాభా పెరుగుతోంది. వాహనాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. రహదారులు వెడల్పవుతున్నాయి.. కొత్త మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ నగరంలో అత్యంత ప్రాథమికమైన పాదచారుల నడకదారుల పరిస్థితి మాత్రం రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలతో కనుమరుగవుతుండటంతో నగరవాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోడ్లపైనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంతకు నగరంలో ఫుట్‌పాత్ ఉందా.. లేదా? అన్న ధోరణిలో పాదచారులు ఉన్నారు. ఒకప్పుడు పాదచారులకు రక్షణగా కనిపించిన ఫుట్‌పాత్‌లు ఇప్పుడు అనేక ప్రాంతాల్లో గుర్తుపట్టలేని స్థితికి చేరాయి. దుకాణాల ముందు ఉన్న నడకదారులపై వ్యాపార సామగ్రి, బల్లలు, స్టాండ్లు, సరుకులు పెట్టడం సాధారణమైపోయింది. సందు దొరికితే చాలు.. తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు ఫుట్‌పాత్‌లను ఉపయోగించుకుంటున్నారు. వీధి వ్యాపారులు సైతం పాదచారుల కోసం కేటాయించిన స్థలాల్లోనే వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో నడిచేందుకు దారి లేకుండా పోతోంది. ప్రధాన రహదారులకే పరిమితమైన సమస్యగా భావించినా.. బస్తీలు, కాలనీలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మెట్రో స్టేషన్ల కింద కూడా ఆక్రమణలే కనిపిస్తున్నాయి. శనగర రవాణా వ్యవస్థలో కీలకంగా మారిన మెట్రో స్టేషన్ల పరిసరాల్లోనూ పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మెట్రో మార్గాల కింద ఏర్పాటు చేసిన నడకదారులపై చిన్నచిన్న వ్యాపారాలు, దుకాణాల సామగ్రి, ఇతర ఆక్రమణలు దర్శనమిస్తున్నాయి. దీంతో మెట్రో ప్రయాణికులు సైతం రోడ్డు మీదికి వచ్చి నడవాల్సిన దుస్థితి కలుగుతుంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు ఫుట్‌పాత్‌లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల మధ్య నుంచి దారి చేసుకుంటూ వెళ్లాల్సి రావడం ప్రమాదకరంగా మారుతోంది.

రోడ్డుపైనే నడక.. ప్రాణాలపైకి ముప్పు....

ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురైతే దాని ప్రభావం కేవలం నడకలో అసౌకర్యంతో ముగియదు. అది నేరుగా పాదచారుల ప్రాణాలపై ప్రభావం చూపుతోంది. నడకదారి లేకపోవడంతో పాదచారులు తప్పనిసరి పరిస్థితుల్లో రహదారిపైనే నడవాల్సి వస్తోంది. అదే సమయంలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు కార్లు, బస్సులు, భారీ వాహనాలు వేగంగా దూసుకెళుతుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉంటుంది. చిన్నపాటి ఢీకొనుళ్ల నుంచి తీవ్ర ప్రమాదాల వరకు చోటుచేసుకుంటున్నాయి. కొందరు తీవ్రంగా గాయపడుతుండగా.. మరికొందరు ప్రాణాలు కోల్పోతున్న విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

నిర్మాణానికి కోట్ల ఖర్చు.. ఉపయోగం మాత్రం శూన్యం

పాదచారుల సౌకర్యం కోసం ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు భారీగా నిధులు వెచ్చించి ఫుట్‌పాత్‌లను నిర్మిస్తున్నాయి. అయితే నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి నిర్వహణ, పరిరక్షణపై తగినంత శ్రద్ధ లేకపోవడం సమస్యగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు పాడైపోయి కనిపించకుండా పోతుంటే.. మరికొన్ని చోట్ల ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమణదారులు తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఫలితంగా ప్రజాధనం ఖర్చు చేసినా.. దాని ప్రయోజనం పాదచారులకు దక్కడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు ఒక్కరోజులో ఏర్పడినవి కావు. నెలల తరబడి, సంవత్సరాల తరబడి కొనసాగుతున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు ఆక్రమణలు తొలగించినా.. కొద్ది రోజులకే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని నగరవాసులు అంటున్నారు. ఆక్రమణలను తొలగించడం మాత్రమే కాకుండా.. తిరిగి ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమని ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ అవసరం...

నగరం విస్తరిస్తున్న వేగానికి అనుగుణంగా పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఫుట్‌పాత్‌లను గుర్తించి, వాటి ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర సర్వే నిర్వహించడంతోపాటు ఆక్రమణలను శాశ్వతంగా అరికట్టే కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫుట్‌పాత్‌ల పరిరక్షణ కోసం ప్రత్యేక పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయడం, ఆక్రమణలపై నిరంతరం తనిఖీలు నిర్వహించడం, ఉల్లంఘనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

పాదచారులకూ నగరంపై హక్కుంది...

నగరాభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు, వెడల్పైన రహదారులు, ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలు నిర్మించడం మాత్రమే కాదు. పాదచారులు సురక్షితంగా నడిచే మార్గాలను కల్పించడం కూడా సమగ్ర నగరాభివృద్ధిలో కీలక భాగమే. ఫుట్‌పాత్‌లు వాహనాల పార్కింగ్ కోసం కాదు.. దుకాణాల విస్తరణ కోసం కాదు.. పాదచారుల కోసం నిర్మించినవన్న విషయాన్ని అధికారులు, వ్యాపారులు గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగరవాసులు ఆశిస్తున్న విషయాన్ని ప్రభుత్వంతో పాటు ప్రభుత్వాధికారులు మరిచిపోకూడదు. ఫుట్‌పాత్ కనిపించని నగరం.. పాదచారులకు సురక్షితం కాని నగరమే. రహదారిపై ప్రతి అడుగు ప్రమాదంగా మారకముందే అధికారులు మేల్కొని నడకదారులను కాపాడాల్సిన సమయం ఆసన్నమైంది. ఫుట్ పాత్ లు కేవలం పాదచారుల కోసమే అన్న విషయాన్ని ప్రభుత్వంతో పాటు అక్కడి దుకాణ సముదాయాల యజమానులు బాధ్యతాయుతంగా భావించాల్సిన అవసరం ఉంది.

**సయ్యదా ఆలియా ఇస్మత్**
**సీనియర్ జర్నలిస్ట్**
**సెల్: 8639754985**

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280